# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటేనే అభివృద్ధి పనులు చేయగలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ఈ సంవత్సరం జులై నాటికి పూర్తి చేసి ఉత్తరాంధ్రకు నీటిని అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు
- ❖ విశాఖలో రాబోయే 5 సంవత్సరాల్లో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పించనున్నామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

==========================

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటేనే అభివృద్ధి పనులు చేయగలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికపై ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికను స్వాగతిస్తున్నామని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వం 67 వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది, కానీ ఆ రుణాలను అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం అందరూ ఆలోచించాలని అభివృద్ధి పనులపైనే నిధులు ఎక్కువ ఖర్చు చేయాలన్నారు. అభివృద్ధి పనుల వల్లే సంపద పెరుగుతుందని, అలాగని అప్పులు చేసి.. పనులు చేస్తే ఇబ్బందులు మరింత పెరుగుతాయని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగంలో పెట్టుబడులకు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతోందని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఈరోజు నిర్వహించిన ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 6 పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని... ఈ అవకాశాన్ని పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

(వాయిస్ 30 సెకన్లు)

==========================

సింహాచలం పంచగ్రామాల భూముల సమస్యపై రాబోయే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలోని పాత్రికేయులతో మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ విలువల హేతుబద్ధీకరణ త్వరలో ఉంటుందని తెలిపారు. గ్రోత్ కారిడార్లలో రిజిస్ట్రేషన్ విలువల పెంపు ఉంటుందని చెప్పారు. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచకూడదని నిర్ణయించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

==========================

పోలవరం ప్రాజెక్టు పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈరోజు ఆయన విజయవాడలో నీటిపారుదల శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులు పూర్తి చేసి 2025 జులై నాటికి ఉత్తరాంధ్రకు నీటిని అందిస్తామని తెలిపారు. 1,050 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు అన్ని అనుమతులు లభించాయన్నారు. పురుషోత్తం పట్నం మీదుగా ఉత్తరాంధ్రకు నీరు ఇస్తామని.. దీనిపై అధికారులతో సమీక్ష చేసి పలు సూచనలు చేశామన్నారు. ఈ సంవత్సరం డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 41 సెకన్లు)

==========================

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు రాష్ట్ర గిరిజన పండుగగా గుర్తింపు పొందిన శ్రీ శంబర పోలమాంబ జాతర ఈరోజు పారంభమయ్యింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ జాతరలో తొలిఘట్టం తొలేళ్లు ఉత్సవం ఈరోజు రాత్రి జరగనుంది. రేపు సిరిమాను సంబరం, బుధవారం అనుపోత్సవ కార్యక్రమం జరగనున్నాయి. జాతరకు ప్రత్యేకంగా 130 బస్సులు, వైద్య శిబిరాలు, సుమారు 700 మంది పోలీసులతో బందోబస్తు, కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు.

విరామం

==========================

ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని.. లేని ఎడల సాధారణ సెలవుగా పరిగణించడం జరుగుతుందని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. ఈరోజు స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు భద్రతా నియమాలు అనుసరించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ద్విచక్రవాహనం కలిగిన ఉద్యోగులు హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరై అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. వాహన చోదకుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలను తీవ్ర మనోవేధనకు గురి చేస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన పెంచుకొని వాటిని పాటించాలన్నారు.

==========================

మధ్యవర్తిత్వం ద్వారా న్యాయపరమైన కేసులకు చాలా వరకు పరిష్కారం చూపవచ్చునని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి తెలిపారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. సుప్రీకోర్టు మీడియేషన్ కౌన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో ఉమ్మడి జిల్లా న్యాయవాదులకు, రిటైర్ట్ న్యాయాధికారులకు, సామాజిక కార్యకర్తలకు 40 గంటల పాటూ మధ్యవర్తిత్వంపై శిక్షణా కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ... దేశంలో పెండింగ్ కేసుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. సుప్రీం కోర్టులోనే సుమారు 60 లక్షల కేసులు, రాష్ట్ర హైకోర్టులో 2.5లక్షల కేసులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని ఉదహరించారు.

==========================

అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం అనిగేరు గిరిజన గ్రామంలో ఈరోజు విద్యుత్ మీటర్ పేలి ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. ఈరోజు తెల్లవారుజామున విద్యుత్ మీటర్ సమీపంలో చలి మంట కాగుతున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ మీటర్ పేలింది. ఈ ప్రమాదంలో చేపా చిన్నమ్మి అనే మహిళకు కాళ్లు, చేతులు కాలిపోయాయి. పేలిన శబ్దానికి చేపా అనితారెడ్డి అనే మరో మహిళ వినికిడి శక్తి కోల్పోయింది. స్థానికుల సమాచారంతో 108లో అధికారులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

==========================

రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ పరువు నష్టం కేసుకి సంబంధించి ఈరోజు విశాఖ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం కోర్టు ఆవరణలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇటీవల జరిగిన దావోస్ పర్యటన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సుముఖత చూపారని చెప్పారు. ప్రముఖ ఐటీ సంస్థలు త్వరలో విశాఖపట్టణానికి రానున్నాయని తెలిపారు. తద్వారా విశాఖలో రాబోయే 5 సంవత్సరాల్లో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పించనున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించే జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందే యువత, వారి భవిష్యత్ ను ఉజ్వలంగా మార్చుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "సంకల్ప్ మెగా జాబ్ మేళా" కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి కలెక్టర్ పాల్గొన్నారు.

==========================
==========================